క్లుప్తంగా

సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న టీమ్ లీడర్ వెంకటరమణ

సోంపేట: జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టులో భాగంగా ప్రతీ కుటుంబానికి సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వాల లక్ష్యమని జల్‌జీవన్ మిషన్ ఇచ్ఛాపురం టీమ్ లీడర్ జె.వెంకటరమణ అన్నారు. మండలంలోని శాసనాం పంచాయతీ అనంతపురం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంపై శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో నీరు-పారిశుద్ధ్య కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఈ ప్రసాద్, సర్పంచ్ బి.లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి కల్పన తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పోషణ కిట్లు పంపిణీ



లబ్ధిదారులకు పోషణ కిట్లు అందజేస్తున్న ఎంపీటీసీ మంధాకిణి

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక ఎంపీటీసీ ఆశి మంధాకిణి లబ్ధిదారులకు వైఎస్సార్ పోషణ కిట్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలు ఆరోగ్యకరంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు అందించే భోజనాలను పరిశీలించారు.

విద్యార్థినులకు అవగాహన



బాలికలకు శిక్షణ ఇస్తున్న జగదీశ్వరరావు

టెక్కలి: ప్రమాదకర పరిస్థితుల్లో బాలికలు ఏవిధంగా తమను తాము రక్షించుకోవాలనే అంశంపై మండలంలోని బూరగాం జెడ్పీహెచ్ స్కూల్‌లో శుక్రవారం అవగాహన కల్పించారు. హెచ్‌ఎం ఎ.చిన్నారావు ఆధ్వర్యంలో బందీ మార్షల్ ఆర్ట్స్ సంస్థ నేతృత్వంలో తైక్వాండో శిక్షకుడు పి.జగదీశ్వరరావు పర్యవేక్షణలో ఆత్మరక్షణ విద్య మెలకువలు నేర్పించారు. దీనివలన విపత్కర పరిస్థితుల నుంచి బయటపడవచ్చు అన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ బృందం సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని సొన్నారెడ్డి గ్రామానికి చెందిన బాలకృష్ణశెట్టి గత కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతూ ఇచ్ఛాపురంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఇచ్ఛాపురం మండలం సన్యాసిపుట్టుగ గ్రామం కేంద్రంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న 'హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సంస్థ' సభ్యులు స్పందించి ఆర్థిక సాయం అందించేందుకు ముందుకొచ్చారు. కొంతమంది జవాన్‌ల సహకారంతో బాధితుడు బాలకృష్ణశెట్టికి రూ.60 వేలు నగదు శుక్రవారం అందజేశారు. అంతేకాకుండా అత్యవసరంగా రక్తం అవసరమని వైద్యులు చెప్పడంతో అక్కడక్కడే ఇద్దరు సభ్యులు రక్తదానం చేశారు. యువకుల సేవా నిరతికి వైద్య సిబ్బందితో పాటు రోగులు సైతం అభినందించారు.

విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం నేడు



స్వేచ్ఛావతి అమ్మవారు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ నాల్గో వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దీనిలో భాగంగా తూర్పు దిక్కున ఉన్న ద్వారం ప్రతిష్ట కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఈ ద్వారం గుండానే ప్రవేశం కల్పించి, ప్రధాన ద్వారం అభివృద్ధి చేయనున్నట్లు తెలియజేశారు.

'ఆక్రమణలు తొలగించండి'

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి ఎన్టీఆర్ కాలనీ సమీపంలో ఉన్న చాకలి చెరువుకి ఎదురుగా కాలువ ఆక్రమణలను తొలగించాలని బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ లింగరాజు చిట్టిబాబుకి కోరారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి వినోద్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు.



ఉప్పుటేరు పొలాలలో సాగు చేస్తున్న ఖర్బూజా పంట

తీరం చెంత.. కాసుల పంట

- ఉప్పుటేరు పొలాల్లో వినూత్న ప్రయోగం
- ఖర్బూజా సాగుతో లాభాలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో డొంకూరు తీర ప్రాంతంలోని ఉప్పుటేరు పంట పొలాలు నిత్యం ఇసుకతో నిండి ఉంటాయి. ఈ పొలాల్లో సాగుచేసే రైతులకు ప్రతి ఏడాది నష్టాలే వెంటాడుతుంటాయి. వర్షాలు ఎక్కువగా కురిసినా, కురవకపోయినా ఇబ్బందులు తప్పవు. పూర్తిగా వర్షాధారంపై ఆధారపడే ఇక్కడి రైతులు వరిపంటపై ఆశలు వదులుకొని వాణిజ్య సంబంధిత ఉద్యానవన పంటలను నమ్ముకుంటారు. అయితే గత మూడేళ్లుగా గ్రామానికి చెందిన దున్న ఆదినారాయణ, దున్న సోమేశ్వరరావు, దున్న మన్మథరావులు చెరో ఎకరంలో ఖర్బూజా పంటను పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఉప్పుటేరు పొలాలు అయితేనేం ధైర్యంతో ముందడుగు వేసి, విద్యుత్ మోటారు సాయంతో ఖర్బూజ పంటతో పాటు టమాటా, పచ్చిమిర్చి, గోరు చిక్కుడు పంటలను సైతం పండిస్తున్నారు. ప్రస్తుతం ఈ పంటలకు మంచి గిరాకీ ఉండటంతో, ఇదే మాదిరిగా తీరప్రాంత రైతులు వాణిజ్య సంబంధ ఉద్యానవన పంటపై ఆసక్తిని చూపిస్తే మరింత మంచి ఫలితాలు వస్తాయని ఉద్యానవన అధికారులు పేర్కొంటున్నారు.



ఏపుగా పెరిగిన టమాటా పంట

రొయ్యల చెరువులతో చేటు



గత మూడేళ్లుగా ఇవే పంటలు పండిస్తున్నాము. ఈ ఏడాది అనుకున్న విధంగా తొలిదశలో ఖర్బూజ పంట కనిపించినా, కాస్తా దగ్గర్లో రొయ్యల చెరువులు ఉండడంతో వాటి ప్రభావం ఈ పంటపై పడింది. కాయ సైజు కూడా తగ్గింది. టమాట, పచ్చిమిర్చి పంటలు బాగున్నాయి. ఉద్యానవన, వ్యవసాయ అధికారులు సలహాలు ఇస్తే పాటిస్తాం.

– దున్న ఆదినారాయణ, డొంకూరు

చురుగ్గా విద్యుత్ స్తంభాల మార్పు



కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కంచిలి: మండలంలో చాలాకాలంగా ఉన్నటువంటి పాడైన విద్యుత్ స్తంభాలు, కండక్టర్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేసే ప్రక్రియను విద్యుత్ యంత్రాంగం చేపడుతోంది. దీనిలో భాగంగా మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో మొత్తం 164 కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా 16 కిలోమీటర్ల లైన్‌లో కండక్టర్లను మార్పు చేశారు. మండల కేంద్రంలో సైతం రెండు రోజులుగా సుమారు 40 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినట్లు ఏఈ ఎన్.గురవయ్య తెలిపారు.

శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ పనులను ఏఈతో పాటు లైన్‌మెన్ సునీల్ ప్రధాన్ పర్యవేక్షణలో మిగతా సిబ్బంది చేపట్టారు. పూర్తిస్థాయిలో పనులు పూర్తయితే మండలంలో గత కొన్నాళ్లుగా నెలకొంటున్న సాంకేతిక సమస్యల నుంచి వినియోగదారులకు విముక్తి లభిస్తుందని భావిస్తున్నారు.

భద్రతపై అవగాహన



నాటకం ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సోంపేట: బారువ పోలీసు స్ఫూర్తి బృందాలు పలు గ్రామాల్లో మహిళా భద్రతపై నాటకాల ద్వారా శుక్రవారం అవగాహన కల్పించారు. మండలంలోని మామిడిపల్లి, కొర్లాం, కర్తలిపాలేం, మాకన్నపురం గ్రామాల్లో పోలీసు శాఖ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. మద్యం సేవించడం వలన కలిగే నష్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సతీష్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పక్కాగా విధులు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అలివేలు మంగమ్మ

ఇచ్ఛాపురం రూరల్: సచివాలయాల ఉద్యోగులు పక్కాగా విధులు నిర్వహించాలని డివిజనల్ అభివృద్ధి అధికారి ఎల్.అలివేలు మంగమ్మ సూచించారు. మండలంలోని బాలకృష్ణాపురం, కేదారిపురం గ్రామ సచివాలయాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులు, పథకాల రికార్డులను పరిశీలించారు. సమయపాలన ఉండాలని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహార వివరాలు, చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కేదారిపురం సచివాలయం సిబ్బంది, వలంటీర్లతో సమావేశాన్ని నిర్వహించారు.

నర్తు విజయంపై హర్షం

కంచిలి: జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా అఖండ మెజార్టీతో నర్తు రామారావు గెలిపొందడంపై కంచిలి జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, కృష్ణారావు దంపతులు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న ఒక క్రమశిక్షణ గల నాయకుడికి దక్కిన విజయంగా పేర్కొన్నారు. లంటీర్లతో సమావేశాన్ని నిర్వహించారు.

పారిశుద్ధ్య పనులు



మురుగు తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు పరిధి సూదికొండలో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. గురువారం పడిన భారీ వర్షానికి ఎక్కడికక్కడ చెత్త నిలిచిపోవడంతో పారిశుద్ధ్య కార్మికులతో తొలగించారు. వార్డు కౌన్సిలర్ శిష్టు బృందావతి, వార్డు ఇన్‌చార్జి శిష్టు గోపీలు పనులను పర్యవేక్షించారు.

యువత భాగస్వామ్యం అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సోమేశ్వరరావు

వజ్రపుకొత్తూరు రూరల్/కాశీబుగ్గ: అగ్ని ప్రమాదాల నివారణలో యువత భాగస్వామ్యం అవసరమని అగ్నిమాపకాధికారి బి.సోమేశ్వరరావు అన్నారు. వజ్రపుకొత్తూరు, కాశీబుగ్గ అగ్నిమాపక కేంద్రంలో శుక్రవారం డిగ్రీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అగ్ని ప్రమాదాలు- వాటి నివారణపై చైతన్యం కల్పించారు. ప్రమాదాల్లో చిక్కుకున్న బాధితులను కాపాడే మార్గాలను కృత్యాలు చేసి చూపించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది యుగంధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఫొటోగ్రాఫర్లు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి ఎంపీడీవో కార్యాలయం రోడ్డులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఫొటో స్టూడియో కాలి బూడిదైన విషయం తెలిసిందే. స్టూడియో కాలిపోవడంతో ఉపాధి కోల్పోయిన ఈశ్వరవరప్రసాదరావుకు తోటి ఫొటో గ్రాఫర్లు అండగా నిలిచారు. సృష్టి ఐక్యత ఫొటో, వీడియోగ్రఫీ అసోసియేషన్ సభ్యులు చందాలు వేసుకొని రూ.23 వేల ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు.

సాగులో యాజమాన్య ఖర్చులు తగ్గాలి



పొలంబడి నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: పంటల సాగులో యాజమాన్య ఖర్చులు తగ్గాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజక్టు మాస్టర్ ట్రైనర్ లక్ష్మున్నాయుడు అన్నారు. జరజాం పంచాయతీ గొలివివానిపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు విత్తన ఎంపిక నుంచి సాగులో మెలకువలు పాటించటం వల్ల మంచి దిగుబడులు సాధ్యమని వివరించారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించి పశువుల ఎరువులు, ఘన, ద్రవ జీవామృతాలు, కషాయాలు వినియోగానికి రైతులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నవధాన్యాలు, పచ్చిరొట్ట సాగు వల్ల తక్కువ ఖర్చుతో భూమి సారవంతంగా మారుతుందని చెప్పారు. కార్యక్రమంలో లీడ్ ఫార్మర్లు రామకృష్ణ, అప్పన్న పాల్గొన్నారు.

22న బడ్జెట్ సమావేశం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రత్యేక బడ్జెట్ సమావేశం ఈనెల 22వ తేదీన నిర్వహించనున్నట్లు చైర్మన్ బళ్ల గిరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా బడ్జెట్ సమావేశం వాయిదా వేశామన్నారు. సమావేశానికి వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, విప్, కో-ఆప్షన్ సభ్యులు హాజరవ్వాలని కోరారు.

పాఠశాలను సందర్శించిన డీఈవో

లావేరు: మురపాక పంచాయతీ పరిధి సీహెచ్ అగ్రహారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారిణి జి.పగడాలమ్మ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలపై ఆరా తీశారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను పరిశీలించారు. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో నాలుగు సంవత్సరాలుగా ప్రైవేటు భవనాల్లో పాఠశాలను నిర్వహిస్తున్నట్టు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు డీఈవో పగడాలమ్మ దృష్టికి తీసుకెళ్లారు. నూతన భవనాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ఆమె స్పందిస్తూ ఇదివరకే ఎంఈవో ద్వారా నివేదిక తెప్పించుకొని నూన భవనాల మంజూరు కోసం ప్రభుత్వానికి, ఉన్నతాధికారులుకు ప్రతిపాదనలు పంపించినట్టు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో భవనాల పరిస్థితి చూశానని.. నూతన భవనాల మంజూరుకు తనవంతు కృషి చేస్తానని డీఈవో అన్నారు.

ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి ఆస్తి, ఖాళీ జాగా పన్నులను ఈనెలాఖరులోపు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. అలా చెల్లిస్తే వడ్డీ మినహాయింపు వర్తిస్తుందన్నారు.

ఎమ్మెల్సీ చొరవతో ధాన్యం కొనుగోలు



జగన్నాథపురం గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

టెక్కలి: నియోజకవర్గంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చొరవతో రైతుల వద్ద మిగిలిపోయిన ధాన్యం కొనుగోలుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ దువ్వాడ కలిసి నియోజకవర్గంలో మిగిలిపోయిన ధాన్యం కొనుగోలుపై వినతిపత్రం అందజేశారు. దీంతో నియోజకవర్గంలో వ్యవసాయాధికారులు రైతు భరోసా కేంద్రాల్లో పర్యటిస్తున్నారు. టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం మండలాల్లో ఈనెల 13 వరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టారు. దీనిలో భాగంగా ఇప్పటికే 24,017 మంది రైతుల నుంచి సుమారు 95,746.18 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అయితే మిల్లర్ల బ్యాంకు గ్యారంటీ లక్ష్యం పూర్తవ్వడంతో ట్రక్ షీట్ ప్రక్రియ నిలిపివేశారు. ఇప్పుడు మరలా ఉన్నతాధికారుల ఆదేశాలతో రైతు భరోసా కేంద్రాల పరిధిలో ట్రక్ షీట్ ప్రక్రియ ఆరంభించారు. నియోజకవర్గంలో మరో 10 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు చర్యలు చేపడుతున్నారు.

దాతల సహకారం అవసరం



పాఠశాల ముఖద్వారం వద్ద దాతలు, ఉపాధ్యాయులు తదితరులు

వజ్రపుకొత్తూరు రూరల్: పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అవసరమని వక్తలు అన్నారు. మండలంలోని నువ్వలరేవు ప్రాథమిక పాఠశాల ముఖద్వారం నిర్మాణానికి కన్నయ్య మాస్టర్ ఎడ్యుకేషన్ చారిటీ సంస్థ సాయం అందించింది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న నాడు-నేడు కార్యక్రమంతో పాఠశాలల రూపురేఖలు మారుతుంటే, ప్రభుత్వానికి తోడుగా సంస్థలు ముందుకు వస్తున్నాయి. ఈ మేరకు కన్నయ్య మాస్టర్ ఎడ్యుకేషన్ సంస్థ అందించిన రూ.45 వేలతో ముఖద్వార నిర్మాణం పూర్తి చేసి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కింతలి సుజాత, ఇజ్రా, కె.జయరాం, కె.ఉదయశ్రీ, స్వాతి, శ్రవంతి, వెంకటేష్, అనంద్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఆవుకు వైద్యం

- ఆదుకున్న 1962 అంబులెన్సు



వైద్యం అనంతరం కోలుకున్న ఆవు

కోటబొమ్మాళి: ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన 1962 అంబులెన్సుతో ఆవుకు సకాలంలో వైద్యం అందడం వలన ప్రాణాలు దక్కాయి. వివరాల్లోకి వెళ్తే.. జలుమూరు మండలం టెక్కలిపాడు గ్రామంలోని వాన అప్పలరామయ్యకు చెందిన ఆవు శుక్రవారం ఉదయం ప్రసవ వేదనతో బాధపడుతుండగా 1962 అంబులెన్స్‌కు కాల్ చేశారు. దీంతో సకాలంలో చేరుకున్న అంబులెన్స్‌లో ఆవును కోటబొమ్మాళి మండలం కురుడు పశువైద్యశాలకు తరలించారు. వెంటనే డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ ఆవుకు ఆపరేషన్ చేసి కడుపులోనే చనిపోయిన దూడను తొలగించారు. ఆవు క్షేమంగా ప్రాణాలతో బయటపడింది. యజమాని హర్షం వ్యక్తం చేశారు.

అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కాశీబుగ్గ: ప్రపంచ ఓరల్ హెల్త్‌డే సందర్భంగా పలాస జీడిపిక్క బొమ్మవద్ద అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి దంత వైద్య నిపుణురాలు అరుణకుమారి మాట్లాడుతూ నోటి కేన్సర్ రాకుండా ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ చిన్నంనాయుడు, డాక్టర్ శ్రావణి, హెడ్‌నర్స్ బర్ల ఇందమ్మ, కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ సందర్శన

టెక్కలి రూరల్: టెక్కలి పోలీసుస్టేషన్‌ను అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ ఫైల్స్‌ను పరిశీలించారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా దిశయాప్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయనతో పాటు టెక్కలి సీఐ చంద్రమౌళి, ఎస్‌ఐ రామకృష్ణ ఉన్నారు.

అనారోగ్యంతో సీఎఫ్ మృతి



ధనలక్ష్మి(ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి గ్రామానికి చెందిన సీఎఫ్ జోగి ధనలక్ష్మి (43) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. మృతురాలికి భర్త రాజు, కుమార్తె శ్రీలత, కుమారుడు శివరాంలు ఉన్నారు. ఆమె మృతిపై సర్పంచ్ లండ లోలాక్షి, మాజీ సర్పంచ్ లండ రామలింగం తదితరులు సంతాపం తెలియజేశారు.